సాక్షి
నాగర్‌కర్నూల్
మంగళవారం ; 25 ; మార్చి ; 2025



నల్ల'గుట్టు' రట్టయ్యేనా..?

కృష్ణా మండలంలోని నల్లగట్టుపై మైనింగ్ దందా గుట్టుగా కొనసాగుతోంది.

వివరాలు 8లో ▸

రంజాన్ వేళలు

ఇఫ్తార్ 6-36 (మంగళవారం సాయంత్రం)

సహర్ 4-56 (బుధవారం తెల్లవారుజామున)

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38.5 /21.5

ఉదయం నుంచే ఎండ ఎక్కువగా ఉంటుంది. ఉక్కపోత పెరుగుతుంది. ఆకాశం స్వల్పంగా మేఘావృతమై ఉంటుంది.

న్యూస్‌రీల్

'ప్రజావాణి'కి 27 అర్జీలు



నాగర్‌కర్నూల్: ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యం ఇస్తూ సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అమరేందర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 27 ఫిర్యాదులు అందాయన్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అదనపు కలెక్టర్‌కు చెప్పుకొని అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్, వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో..



నాగర్‌కర్నూల్ క్రైం: పోలీస్ ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలని ఏఎస్పీ రామేశ్వర్ అన్నారు. సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 11 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ క్రమంలో ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈక్రమంలో పోలీస్ ప్రజావాణికి తగు న్యాయం చేయాలని 6, భూమి పంచాయతీకి సంబంధించి 4, భార్యాభర్తల గొడవపై ఒక ఫిర్యాదు వచ్చాయన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

నాగర్‌కర్నూల్ క్రైం: జిల్లాకేంద్రంలో డయల్ యువర్ డీఎం కార్యక్రమం మంగళవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించనున్నట్లు నాగర్‌కర్నూల్ డిపో మేనేజర్ యాదయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రజలు, ప్రయాణికులు సెల్ నం.73824 46772కు ఫోన్ చేసి ఆర్టీసీ సంస్థ అభివృద్ధి కోసం తమ సలహాలు, సూచనలు అందించాలని కోరారు.

27న గ్రీవెన్స్ డే

కందనూలు: విద్యుత్ వినియోగదారుల సమస్యలపై జిల్లాకేంద్రం హెచ్‌బీకాలనీలోని ఎస్ఈ కార్యాలయంలో గురువారం సీజీఆర్ఎఫ్(కన్జూమర్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ ఫోరం) హైదరాబాద్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించనున్నట్లు విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీపాల్ రాజు, డీఈ రవికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమస్యల పరిష్కారానికి హాజరయ్యే వారు ఆధారు, కరెంట్ బిల్లు రశీదు తీసుకొని ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చేరుకోవాలని కోరారు. నాగర్‌కర్నూల్ సర్కిల్ పరిధిలోని అన్ని మండలాల వినియోగదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు.

నేడు న్యాయవాదులు విధుల బహిష్కరణ

పాలమూరు: హైదరాబాద్‌లో న్యాయవాది ఇజ్రాయెల్‌ను హత్య చేయడాన్ని నిరసిస్తూ మంగళవారం జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా కోర్టులో విధులు బహిష్కరిస్తున్నట్లు జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కోర్టులో పనిచేసే న్యాయవాదులు మొత్తం విధులు బహిష్కరించి నిరసన కార్యక్రమానికి హాజరుకావాలన్నారు. ఇటీవల రాష్ట్రంలో న్యాయవాదుల హత్యలతోపాటు దాడులు పెరగడం బాధాకరమన్నారు.

యథాతథంగా రెస్క్యూ ఆపరేషన్



- ఎస్ఎల్‌బీసీలో కొనసాగనున్న అన్వేషణ
- 31వ రోజూ సహాయక చర్యలు ముమ్మరం
- ఎప్పటికప్పుడు విడిభాగాల తరలింపు
- ఏడుగురి ఆచూకీ కనుగొనాలని సీఎం ఆదేశాలు - అచ్చంపేట

వివరాలు 8లో ▸

ఇకపై సన్నబియ్యం

వచ్చే నెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా పంపిణీ



జిల్లాకేంద్రంలోని రేషన్ దుకాణంలో బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

- ఉగాది పండుగ కానుకగా అమలుకు చర్యలు
- జిల్లాలో 2.37 లక్షల కుటుంబాలకు ప్రయోజనం
- ప్రతినెల 4 వేల మె.ట., బియ్యం అవసరం
- బియ్యం పక్కదారికి అడ్డుకట్ట పడినట్టేనా?

జిల్లా పరిధిలో ఇలా..	
మొత్తం చౌకధర దుకాణాలు 558	
రేషన్ కార్డులు	లబ్ధిదారులు
2,37,833	7,50,598
ప్రతినెలా కేటాయించే బియ్యం కోటా 4,861 మె.ట.,	

నాగర్‌కర్నూల్: తెల్లరేషన్ కార్డుదారులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. వచ్చే నెల నుంచి తెల్లరేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ సన్న బియ్యం పంపిణీ చేయనుంది. కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల సమయంలో రాష్ట్రంలో తెల్ల రేషన్ కార్డుదారులందరికీ సన్న బియ్యం పంపిణీ చేస్తామని హామీ ఇచ్చింది. అందుకు అనుగుణంగానే సన్న బియ్యం పంపిణీకి సంబంధించి ఏర్పాట్లు చకచకా చేపడుతోంది. ఉగాది పండుగ సందర్భంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటుంది. అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన వెంటనే పంపిణీ చేసేందుకు కావాల్సిన సన్న బియ్యం అందుబాటులో లేకపోవడంతో ఈ పథకాన్ని ఇన్నిరోజులు వాయిదా వేసింది. తాజాగా గత సీజన్‌లో రైతులకు సన్నబియ్యంపై రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించడం, రైతులు పెద్దఎత్తున సన్న బియ్యం పండించారు. దీంతో వానాకాలం సీజన్‌లో కేంద్రాల ద్వారా ఈ బియ్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. గత డిసెంబర్‌లో ఈ బియ్యాన్ని కొనుగోలు చేయగా.. ప్రస్తుతం లబ్ధిదారులకు సరిపడా బియ్యం అందుబాటులో ఉండటంతో ఈ పథకాన్ని ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది.

ఒక్కరికి 6 కిలోలు..

జిల్లావ్యాప్తంగా మొత్తం 558 రేషన్ దుకాణాలు ఉన్నాయి. దీనికి సంబంధించి ప్రస్తుతం 2,37,833 రేషన్ కార్డులు ఉండగా అందులో 7,50,598 మంది లబ్ధిదారులు ఉన్నారు. జిల్లాలో ఉన్న రేషన్ కార్డు లబ్ధిదారుల కోసం ప్రతినెలా 4,861 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయిస్తున్నారు. ఇందులో సాధారణ రేషన్ కార్డులు 2,19,144, అంత్యోదయ కార్డులు 18,652, అన్నపూర్ణ కార్డులు 37 ఉన్నాయి. అదేవిధంగా జిల్లాలో 7 రేషన్ మండల లెవల్ స్టాక్ పాయింట్లు ఉన్నాయి. ఆహార భద్రత కింద ఒక్కో మనిషికి ఆరు కిలోల చొప్పున బియ్యం, అంత్యోదయ కార్డుల దారులకు 35 కిలోలు, అన్నపూర్ణ కార్డుదారులకు 10 కిలోల చొప్పున సరఫరా చేస్తున్నారు. ప్రతినెలా 1 నుంచి 15వ తేదీ వరకు బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది.

ఆదేశాలు వచ్చాయి..

వచ్చే నెల నుంచి జిల్లాలో రేషన్ కార్డు లబ్ధిదారులకు సన్న బియ్యం పంపిణీ చేయాలని ఆదేశాలు వచ్చాయి. ఈ మేరకు దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నాం. ఒక్కో లబ్ధిదారుడికి 6 కిలోల చొప్పున సన్నబియ్యం పంపిణీ చేస్తాం.

– శ్రీనివాస్, డీఎస్ఓ

బియ్యం పక్కదారికి చెక్..

రేషన్ దుకాణాల్లో వచ్చే నెల నుంచి సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో బియ్యం అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడనుంది. రేషన్ దుకాణాల్లో దొడ్డు బియ్యం తీసుకునే చాలా మంది లబ్ధిదారులు వాటిని వాడుకోకుండా బయట మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వం పేదల కోసం ప్రవేశపెట్టిన ఈ పథకం పక్కదారి పడుతుంది. వీటిని అమ్ముకోవడంతోపాటు బహిరంగ మార్కెట్‌లో దాదాపు 5 వేలకు పైగా చెల్లించి క్వింటాల్ సన్న బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు. దీంతో అక్రమార్కులు సైతం పేద వారితో తక్కువ ధరకు బియ్యాన్ని కొనుగోలు చేసి అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రస్తుతం దొడ్డు బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇస్తే పేదలే వాడుకుంటే బియ్యం అక్రమాలకు అడ్డుకట్ట పడుతుందని భావిస్తున్నారు.

క్షయ నిర్మూలనకు కృషి చేయాలి



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి

నాగర్‌కర్నూల్ క్రైం: క్షయవ్యాధి నిర్మూలనకు వైద్య సిబ్బంది కృషి చేయాలని డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ ఆవరణలో ప్రపంచ క్షయవ్యాధి నిర్మూలన దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయవ్యాధిపై క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారన్నారు. ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్ వందరోజుల నిక్షయ్ శిబిర్‌లో భాగంగా జిల్లావ్యాప్తంగా 250 క్యాంపులు నిర్వహించి 1,37,325 మంది అనుమానితులను (మధుమేహ వ్యాధిగ్రస్తులు, పొగ తాగేవారు, క్షయవ్యాధిగ్రస్తుల కుటుంబ సభ్యులు, మద్యపానం చేసేవారిని) పరీక్షించి, ఎక్స్‌రే 7,717, సీబీ నాట్ కళ్లె పరీక్షలు 2,061, మైక్రోస్కోపిక్ కళ్లె పరీక్షలు 250 మందికి జరిపి కొత్తగా 511 క్షయ వ్యాధిగ్రస్తులను గుర్తించి చికిత్స ప్రారంభించినట్లు చెప్పారు. క్షయవ్యాధి సంపూర్ణ చికిత్సతో పూర్తిగా నయమవుతుందని, క్షయ వ్యాధిగ్రస్తులు పౌష్టికాహారం తీసుకోవాలనే ఉద్దేశంతో ప్రతినెల వారి బ్యాంక్ అకౌంట్‌లో రూ.వెయ్యి జమ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ వెంకటదాసు, ప్రోగ్రాం అధికారి రవికుమార్, వైద్యులు సంతోష్ అభిరాం, వాణి తదితరులు పాల్గొన్నారు.

జన్యుపరలోపంతో సికిల్ సెల్ అనీమియా

సికిల్ సెల్ అనీమియా జన్యుపరమైన లోపంతో తల్లిదండ్రుల నుంచి పిల్లలకు సంక్రమిస్తుందని డీఎంహెచ్ఓ స్వరాజ్యలక్ష్మి అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సికిల్ సెల్ అనీమియాపై వైద్యాధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సాధారణంగా ఎర్ర రక్త కణాల జీవితకాలం 120 రోజులు ఉంటుందని, కానీ.. సికిల్ సెల్ వ్యాధితో బాధపడే వారికి వాటి జీవితకాలం 10- 20 రోజులకు తగ్గుతుందన్నారు. ఈ వ్యాధి గిరిజనులలో అధికంగా ఉంటుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 59,154 మంది గిరిజనులకు సికిల్ సెల్ ప్రాథమిక పరీక్ష నిర్వహించినట్లు చెప్పారు. సికిల్ సెల్ బాధితులు దివ్యాంగుల కోటా కిందికి వస్తారని, వీరికి ప్రభుత్వం దివ్యాంగులకు ఇచ్చే అన్ని ఉచిత పథకాలు వర్తిస్తాయన్నారు.

పకడ్బందీగా 'పది' మూల్యాంకనం

కందనూలు: జిల్లాలో పదో తరగతి వార్షిక పరీక్షలకు సంబంధించి జవాబు పత్రాల మూల్యాంకనం వచ్చే నెల 7 నుంచి ప్రారంభం కానుందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని డీఈఓ రమేష్‌కుమార్ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని లిటిల్ ఫ్లవర్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఇప్పటి వరకు వివిధ జిల్లాల నుంచి నాగర్‌కర్నూల్‌కు చేరుకున్న జవాబు పత్రాలను భద్రపరిచి గదికి తాళం వేసిన సీల్‌ను డీఈఓ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మూల్యాంకన కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, బెంచీలు, కుర్చీలతోపాటు జవాబు పత్రాల కోడింగ్‌ను పరిశీలించాలన్నారు. మూల్యాంకనానికి వచ్చే ఉపాధ్యాయులకు ఇబ్బందులు కలగకుండా తాగు నీరు, ఫ్యాన్లు ఇతర సదుపాయాలు కల్పించాలని చెప్పారు. డీఈఓ వెంట జిల్లా పరీక్షల నిర్వహణాధికారి రాజశేఖర్‌రావు, సహాయ అధికారి సత్యనారాయణ రెడ్డి, పాఠశాల హెచ్ఎం రాజు తదితరులున్నారు.



లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో మూల్యాంకన ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఈఓ రమేష్‌కుమార్

సీహెచ్‌సీని పరిశీలించిన కాయకల్ప బృందం

కల్వకుర్తి టౌన్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సౌకర్యాలను మెరుపరిచేందుకు ప్రతిఏటా అందించే కాయకల్ప టీం సభ్యులు సోమవారం సీహెచ్‌సీని పరిశీలించారు. కాయకల్పలో భాగంగా పీర్ అసెస్‌మెంట్ టీం సభ్యులు ఆస్పత్రిని పరిశీలించి.. పలు వివరాలు సేకరించారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాలను పరిశీలించిన బృందం సభ్యులు ఇందిర రోగులకు అందిస్తున్న వైద్యసేవల గురించి ఆరాతీశారు. ముఖ్యంగా మెటర్నిటీ వార్డులో ఉన్న లేబర్ రూం, ఆపరేషన్ థియేటర్, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సేవల వివరాలను పేషెంట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని బయో మెడికల్ వేస్టేజ్, పారిశుద్ధ్య నిర్వహణ, ఆస్పత్రి అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలు, ఆస్పత్రికి వచ్చే రోగుల వివరాలు తదితర అంశాలను సేకరించి నమోదు చేసుకున్నారు. వైద్యుల బృందంతోపాటు ఆస్పత్రి సూపరింటెండెంట్ శివరాం, వైద్యులు విష్ణు, ఉదయ్, షకీల్, హెడ్‌నర్సు సునీత పాల్గొన్నారు.



బాలింతతో మాట్లాడుతున్న కాయకల్ప పీర్ కమిటీ సభ్యులు

నల్లమలలో పులుల గణన

కొల్లాపూర్: నల్లమల అటవీ ప్రాంతంలో అటవీ అధికారులు పులుల గణన చేపట్టారు. కొల్లాపూర్ సమీపంలోని నల్లమల అడవిలో రెండు రోజుల క్రితం గణన ప్రారంభించినట్లు ఫారెస్టు రేంజర్ చంద్రశేఖర్ తెలిపారు. ఫేజ్-4లో భాగంగా కొల్లాపూర్ రేంజ్‌లో బయాలజిస్టు రవికాంత్ నేతృత్వంలో పులులు, చిరుతల పాదముద్రలు సేకరిస్తున్నట్లు వివరించారు. అటవీ ప్రాంతంలో ప్రతి రెండు చదరపు కిలోమీటర్లకు ఒక కెమెరా ఏర్పాటు చేశామని, కెమెరాలో రికార్డు అయిన వన్యప్రాణులతోపాటు పాదముద్రల ఆధారంగా గణన కొనసాగుతుందని చెప్పారు. పులుల గణనలో స్థానిక ఫారెస్టు అధికారులతోపాటు బేస్ క్యాంపు సిబ్బంది పాల్గొంటున్నారన్నారు. గతేడాది కొల్లాపూర్ రేంజ్ పరిధిలో 9 పులులను గుర్తించామని ఆయన వెల్లడించారు. అనుమతి లేకుండా ఎవరూ అడవిలోకి వెళ్లవద్దని సూచించారు.



అటవీ ప్రాంతంలోని సీసీ కెమెరా పుటేజీలను పరిశీలిస్తున్న అధికారులు

పరీక్షలకు 25 మంది విద్యార్థుల గైర్హాజరు

కందనూలు: జిల్లాలో పదో తరగతి పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని డీఈఓ రమేష్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆంగ్లం పరీక్షకు 10,562 మంది విద్యార్థులకు గాను 10,537 మంది హాజరు కాగా 25 మంది గైర్హాజరయ్యారని ఆయన చెప్పారు. అంతకు ముందు ఉదయం 8 గంటలకు కల్వకుర్తి పోలీస్‌స్టేషన్ నుంచి జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్ల పరిధిలోని 60 పరీక్ష కేంద్రాల సీఎస్, డీఓలతో వైర్‌లెస్ సెట్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పరీక్ష నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్‌లదే కీలక పాత్ర అని, పరీక్ష విధుల్లో అలసత్వం ప్రదర్శించకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని ఆదేశించారు. జిల్లాలో ఎలాంటి మాల్ ప్రాక్టీసింగ్ కేసులు నమోదు కాలేదన్నారు.

■ ఎండలు మండిపోతున్నాయి. అటు ఇంట్లో, ఇటు కార్యాలయంలో ఉండలేకపోతున్నాం. మీకు ఇంత అనుకూలంగా ఉండి సాయం చేస్తున్నాం. కనీసం ఏసీలు ఇప్పించలేరా?

■ సార్ మీరు అడగడం.. మేము కాదనడమా? మాకు మీరు, మీకు మేము. కచ్చితంగా ఇప్పిస్తాం. మీరు చల్లంగుండాలి. మాకూ మేలు జరిగేలా సహకరిస్తే చాలు..

..జోగులాంబ గద్వాల జిల్లా సివిల్ సప్లయ్ శాఖలో ఓ ఇద్దరు కీలక అధికారులు.. మిల్లర్లతో కుమ్మక్కై తెరచాటున నడిపిన వ్యవహారం ఇది. ఆ అధికారులు తమ కోరికను అలా వెల్లిబుచ్చారో లేదో ఇలా కొందరు మిల్లర్లు కలిసి ఒకరికి రెండు ఏసీలు ఇప్పించారు. మరో అధికారి కోసం కొనుగోలు చేసిన ఏసీలను ఒకట్రెండు రోజుల్లో బిగించే ప్రయత్నంలో ఉన్నారు. ఇదంతా వారు ఉచితంగా చేశారనుకుంటే పప్పులో కాలేసినట్లే. దీని వెనుక వేరే మతలబు ఉంది గురూ..!

..ఇది ఈ ఒక్క జిల్లాలోనే కాదు. ఉమ్మడి పాలమూరులోని అన్ని జిల్లాల్లో ఇలాంటి పరిస్థితే నెలకొన్నట్లు తెలుస్తోంది. ఏసీలు కాకపోతే.. కంప్యూటర్లు ఇతరత్రా వస్తు రూపేణా ఇచ్చి పుచ్చుకోవడాలు జరుగుతున్నాయి.

– సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/గద్వాల



చల్లంగుండాలి..

మాకు మీరు.. మీకు మేము !

'సివిల్ సప్లయ్'లో తోడు దొంగలు

- జోగులాంబ గద్వాల జిల్లాలో ఓ ఇద్దరు అధికారుల హవా
- మిల్లర్లతో కుమ్మక్కై ఇష్టారాజ్యంగా వ్యవహారం
- వేడి భరించలేం.. ఏసీలు ఇవ్వాలంటూ బేరం
- నజరానాగా లారీకి 5 క్వింటాళ్ల సీఎమ్మార్ మిగిలించుకునేలా ఒప్పందం
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఇలాంటి పరిస్థితే..

ఆ నలుగురు మిల్లర్లే కీలకం..

గద్వాల నుంచి జూరాల ప్రాజెక్టు మార్గంలో ఒకటి, గద్వాల నుంచి బీరెల్లి వెళ్లే దారిలో మరొకటి, గద్వాల నుంచి అయిజ వెళ్లే మార్గంలోని రెండు రైస్ మిల్లులకు సంబంధించిన మిల్లర్లే జిల్లా సివిల్ సప్లయ్ శాఖలో చక్రం తిప్పుతున్నట్లు తెలుస్తోంది. కీలక అధికారులకు అన్నీ తామై సహకరిస్తూ తమ, తమ వర్గానికి సంబంధించిన వ్యవహారాలను చక్కబెట్టుకుంటున్నట్లు ఆ శాఖలో చర్చ జరుగుతోంది. ఏసీల వ్యవహారంలోనే వారే ముందుండి నడిపినట్లు సమాచారం.

ఇద్దరూ ఇద్దరే..

గద్వాల జిల్లా సివిల్ సప్లయ్ శాఖలోని ఓ కీలక అధికారి తన మాటే వేదం అన్నట్లుగా వ్యవహరిస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. శాఖలో తన అనుమతి లేకుండా చీమ చిటుక్కుమనడానికి కూడా వీలులేదని హుకుం జారీ చేశారట. ఈ అధికారి ఇటీవలే బదిలీపై జిల్లాకు రాగా.. తక్కువ కాలవ్యవధిలోనే అక్రమాలకు కేరాఫ్ అడ్రస్‌గా పేరుగాంచిన కొందరు రైస్ మిల్లర్లతో బలమైన స్నేహ బంధాన్ని ఏర్పరచుకున్నట్లు సమాచారం. ఈ కారణంగానే 2024–25 ఖరీఫ్ సీజన్‌లో తన మాట విని, తన మార్గంలో నడిచే వారికి ఎక్కువ మొత్తంలో.. తన మాట వినని వారికి తక్కువ మొత్తంలో ధాన్యం కేటాయింపులు చేసినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై పలువురు రైస్ మిలర్లు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అదేవిధంగా మరో అధికారి సైతం తనకు అనుకూలంగా ఉండే మిల్లర్లకు వెసులుబాటు కల్పిస్తూ సహకరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆ అధికారి కారణంగానే గతంలో ప్రభుత్వానికి రావాల్సిన సీఎమ్మార్ బియ్యం బకాయిలు పేరుకుపోయాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. తాజాగా ఏసీల ఉదంతం వెలుగులోకి రాగా.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది.

'మమకారం' పంచిన మిల్లర్లకే మొగ్గు..

ఖరీఫ్ సీజన్‌లో రైతులు పండించిన ధాన్యాన్ని మద్దతు ధరతో పాటు రూ.500 బోనస్‌తో ప్రభుత్వం కొనుగోలు చేసిన విషయం విదితమే. జోగుళాంబ గద్వాల జిల్లాలో 61 వేల మెట్రిక్ టన్నులు, వనపర్తి జిల్లాలో 35 వేల మెట్రిక్ టన్నులు.. మొత్తం 96 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. ధాన్యాన్ని మర ఆడించి సీఎమ్మార్ కింద బియ్యంగా ఇవ్వాలని గద్వాల జిల్లాలోని 37 రైస్ మిల్లులకు కేటాయించారు. ఈ కేటాయింపుల్లోనే సివిల్ సప్లయ్ అధికారులు వివక్ష చూపినట్లు తెలుస్తోంది. తమపై మమకారం చూపిన మిల్లర్లకు అధికంగా.. తమను పట్టించుకోని వారికి తక్కువ మొత్తంలో ధాన్యం కేటాయింపులు చేసినట్లు సమాచారం. మొత్తానికి గద్వాల, వనపర్తి జిల్లాల నుంచి ఖరీఫ్ సీజన్‌లో కొనుగోలు చేసిన 96 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని మర ఆడించి.. 60 వేల మెట్రిక్ టన్నుల బియ్యం అందించాల్సి ఉంది. ఇందులో ఇప్పటివరకు సుమారు 23 వేల మెట్రిక్ టన్నుల బియ్యాన్ని మాత్రమే మిల్లర్లు అప్పగించినట్లు అధికారిక రికార్డులు చెబుతున్నాయి.

కేటాయింపులే ఆసరాగా..

తమకు సన్నిహితంగా ఉంటూ అన్ని రకాలుగా ఆదుకుంటున్న రైస్ మిల్లర్లకు ఎక్కువ మొత్తంలో ధాన్యం కేటాయింపులు చేసిన పౌర సరఫరాల శాఖలో కీలక అధికారులు.. దీన్ని ఆసరాగా చేసుకుని ఇటీవల వారితో ఏసీల బేరం పెట్టారు. 'మీకు ఎక్కువ మొత్తం ధాన్యం ఇచ్చినందుకు మమ్మల్ని దుమ్మెత్తిపోశారు.. ఇప్పుడు ఇంత ఎండలో మండిపోతుంటే మీకు కనికరం లేకపోతే ఎలా?' అంటూ మిల్లర్లతో పరోక్షంగా తమ ఇష్టాన్ని వెలిబుచ్చారు. ఆ తర్వాత 'ఏసీలు ఇప్పించినందుకు మా వాటాలు తగ్గించొద్దు.. మీరు ప్రభుత్వానికి అందించాల్సిన బియ్యంలో లారీకి 5 క్వింటాళ్ల చొప్పున తగ్గించి ఇవ్వండి.. మేము చూసుకుంటాం' అంటూ ఉచిత సలహా ఇచ్చినట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. దీంతో వెంటనే మిల్లర్లు ఏసీలు కొనుగోలు చేసి ఓ అధికారి ఇంట్లో, చాంబర్‌లో బిగించినట్లు సమాచారం.

అధికారులు ఏమంటున్నారంటే..

గద్వాల జిల్లా సివిల్ సప్లయ్ శాఖలో ఏసీల ఉదంతం చర్చనీయాంశంగా మారిన నేపథ్యంలో ఓ అధికారిని సంప్రదించగా.. 'నా సొంత జీతం డబ్బులతో ఏసీని కొనుగోలు చేశా. రెండు వారాల క్రితమే ఆఫీస్‌లోని నా గదిలో ఫిట్ చేశారు. అమెజాన్‌లో మా ఆఫీస్ వాళ్లు బుక్ చేశారు. నాకు ఏ రైస్‌మిల్లర్ బహుమానంగా ఇప్పించలేదు.' అని చెప్పారు. మరో అధికారితో మాట్లాడగా.. 'మా స్థాయి అధికారులు ఆఫీస్‌లో ఏసీలు వాడడం నేరం. అందుకు రూల్స్ ఒప్పుకోవు. నేను పనిచేసిన చోట ఫ్యాన్లనే వాడుతాను.' అని సమాధానం ఇచ్చారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి


నరహరి (ఫైల్)

ఎర్రవల్లి: మండలంలోని కొండపేటకు చెందిన గద్వాల నరహరి (25) చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఎస్‌ఐ వెంకటేష్ వివరాల మేరకు.. నరహరి పెళ్లి విషయంలో ఆదివారం కుటుంబ సభ్యులు మందలించారు. ఈ క్రమంలో తనకు ఇష్టం లేని పెళ్లి చేస్తున్నారని మనస్థాపానికి గురై పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి తండ్రి గద్వాల సింగోటం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధుడు..

గద్వాల: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధుడు మృతిచెందిన ఘటన ధరూరు మండలంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీహరి వివరాల మేరకు.. అయిజ మండలం చిన్నతాండ్రపాడు చెందిన కుర్వకిష్టన్న అనే వృద్ధుడు ఇటీవల కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంట్లో నుంచి వెళ్లిపోయాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు చుట్టుపక్కల ప్రాంతాలు, బంధువుల వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. వృద్ధుడి అదృశ్యంపై అయిజ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ క్రమంలో సోమవారం జూరాల ప్రాజెక్టు ఎడమ కాల్వ వద్ద ముళ్లపొదల్లో శవమై కనిపించాడు. విషయాన్ని స్థానిక జాలర్లు ధరూరు పోలీసులకు తెలియజేయగా.. కుర్వ కిష్టన్నగా గుర్తించారు. దాదాపు కుళ్లిపోయిన స్థితిలో ఉన్న మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయాన్ని కుర్వ కిష్టన్న కుటుంబ సభ్యులకు తెలియజేశారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీహరి తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఊట్కూరు/కోస్గి/భూత్పూర్: ఊట్కూరు మండలంలోని అవుసలోనిపల్లి గ్రామ శివారులో ఆదివారం రాత్రి అక్రమంగా ట్రాక్టర్‌లో ఇసుక తరలిస్తుండగా పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కృష్ణంరాజు తెలిపారు. గ్రామానికి చెందిన సాలేరాముపై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

● కోస్గి మండలంలో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ బాల్‌రాజ్ తెలిపారు. మండలంలోని కడంపల్లి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా పట్టుకుని స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

● భూత్పూర్ మున్సిపాలిటీలోని అమిస్తాపూర్ సమీపంలో అనుమతుల్లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు. విధుల్లో భాగంగా సోమవారం గ్రామాల్లో గస్తీ తిరుగుతున్న పోలీసులకు ఇసుక తరలిస్తున్న టిప్పర్ కనపడగా తనిఖీ చేయగా ఎలాంటి అనుమతి లేదు. దీంతో టిప్పర్ డ్రైవర్ నక్కలి సురేందర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

నంబర్ ప్లేట్ లేని ట్రాక్టర్..

నాగర్‌కర్నూల్ క్రైం: నంబర్ ప్లేట్ లేని ఇసుక ట్రాక్టర్‌ను సీజ్ చేసినట్లు ఏఎస్పీ రామేశ్వర్ సోమవారం తెలిపారు. జిల్లాకేంద్రంలో ఇసుక డంప్ చేసి వస్తుండగా ఎస్పీ కార్యాలయం ఎదుట ట్రాక్టర్‌ను తనిఖీ చేయడంతో నంబర్ ప్లేట్ లేనట్లు గుర్తించి జిల్లా రవాణాశాఖ అధికారికి అప్పగించినట్లు వివరించారు. ఎవరైనా నంబర్ ప్లేట్లు లేకుండా వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రామన్‌పాడులో 1,016 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,016 అడుగులకు నీటిమట్టం వచ్చి చేరిందని ఏఈ వరప్రసాద్ తెలిపారు. జూరాల ఎడమ కాల్వ ద్వారా 275 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుందని.. సమాంతర కాల్వ ద్వారా వచ్చే నీటిని నిలిపివేశారని పేర్కొన్నారు. రామన్‌పాడు నుంచి ఎన్టీఆర్ కాల్వ ద్వారా 27 క్యూసెక్కులు, కుడి, ఎడమ కాల్వలకు 57 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

నల్ల'గుట్టు' రట్టయ్యేనా..!


నల్లగట్టులోని క్వారీల్లో వాహనాలు, డ్రిల్లింగ్ చేస్తున్న కంప్రెషర్

● అనుమతుల్లేకుండా బ్లాస్టింగ్
● ఊపందుకున్న మైనింగ్
● రెచ్చిపోతున్న అక్రమార్కులు
● మామూళ్ల మత్తులో అధికారులు
● బీటలు వారుతున్న నివాసగృహాలు
● భయాందోళనలో ప్రజలు


బ్లాస్టింగ్ కోసం హోల్స్ కొడుతున్న కార్మికుడు

కృష్ణా : మండలంలోని నల్లగట్టులో గుట్టుగా మైనింగ్ కొనసాగుతోంది. అనుమతుల్లేకుండా అక్రమార్కులు ఇష్టానుసారంగా గుట్టను ధ్వంసం చేస్తూ భారీ పేలుడు పదార్థాలతో బ్లాసింగ్‌కు పాల్పడుతున్నారు. గత రెండు, మూడేళ్లలో గుట్ట రూపురేఖలే పూర్తిగా మారిపోయాయి. కర్ణాటకలోని బళ్లారిలో మాదిరిగానే ఇక్కడి రాయిని తీస్తున్నారు. ఇక్కడి అధికారులు, నాయకులు అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు.

ఇళ్లలో నుంచి బయటకు రావొద్దంటూ..

ప్రతి రోజు బ్లాసింగ్ ఇళ్లు, ప్రభుత్వ భవనాలు బీటలు వారుతున్నాయి. నివాస ప్రాంతాల్లో రాళ్లు పడుతుండటంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. బ్లాస్టింగ్ సమయంలో జాతీయ రహదారిపై కొన్నిసార్లు వాహనాలను నిలిపివేస్తున్నారు. ఇళ్లల్లో నుంచి బయటకు రావొద్దు నిర్వాహకులు హుకుం జారీ చేస్తున్నారు. ఇలాంటి ఇబ్బందులు కొన్నేళ్లుగా అనుభవిస్తున్నా మైనింగ్, రెవెన్యూ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. అక్రమార్కులు ఇచ్చే మామూళ్ల మత్తులో చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రతినిత్యం ఈ క్వారీ, క్రషర్ మిషన్లలో అమాయక ప్రజలు, కూలీలు పనిచేస్తూ తమ ప్రాణాలు కోల్పోతున్నారు. ఇలాంటి ఘటనలు బయటకు పొక్కకుండా అక్కడికక్కడే వారికి కొంత డబ్బు ఇచ్చి మూసివేసిన సందర్భాలు ఉన్నాయని ప్రజలు బహిరంగంగా ఆరోపిస్తున్నారు.

శ్రమ దోపిడీ..

ఈగుట్టకు ఉన్న క్వారీల్లో వందల సంఖ్యలో కూలీలు పనిచేస్తున్నారు. వారు రోజంతా పనిచేస్తే కనీసం రెండు, మూడు వందలు కూలి కూడా ఇవ్వడంలేదని కర్ణాటక కూలీలు ఆరోపిస్తున్నారు. వారు పనిచేసేచోట ప్రమాదం అని తెలిసినా కూడ వారు తమ పిల్లలను అక్కడే ఉంచుకుంటున్నారు.

బోరు బావుల్లో నీళ్లు తగ్గుతున్నాయ్



బ్లాస్టింగ్ మూలంగా పక్కనే ఉన్న తమ పొలాల్లోని బోరుబావుల్లో నీళ్లు తగ్గుతున్నాయి. గతంలో 100 ఫీట్లల్లో నీళ్లు వచ్చేవి. ఇప్పుడు 200 ఫీట్లు బోర్లు వేసినా నీళ్లు రావడం లేదు. బ్లాస్టింగ్ చేసిన సమయంలో భూమి అదిరి నీళ్లు కిందకు వెళ్తున్నాయి.
– బుమోళ్ల రాము, గుడెబల్లూర్ గ్రామం.

దుమ్ము ధూళితో రోగాలు



గుట్టకు ఏర్పాటుచేసిన క్రషర్ మిషన్ల మూలంగా వచ్చే దుమ్ము ధూళితో రోగాలు వస్తున్నాయి. ప్రతి రోజు సాయంత్రం 6 గంటలు అయితే చాలు ఆ దుమ్ముధూళితో నరకం చూస్తున్నాం. జాతీయ రహదారికి పక్కన ఉన్న క్రషర్ మూలంగా వచ్చే దుమ్ముతో రోడ్డుపై వెళ్లే ద్విచక్ర, ఇతర వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.
– చెవిటోళ్ల సురేష్,గుడెబల్లూర్ గ్రామం.

కొన్నింటికి అనుమతులున్నాయ్

నాలుగు క్వారీలు, మూడు స్టోన్ క్రషర్లకు మైనింగ్ శాఖ నుంచి అనుమతులున్నాయ్. 551, 348, 355, 356 సర్వే నంబర్‌లలో మొత్తం 66ఎకరాల్లో మైనింగ్‌కు అనుమతులు ఉన్నాయి. అనుమతులు లేని క్వారీల్లో పనులను నిలిపివేసి, గనుల శాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందిస్తాం.
– వెంకటేష్, తహసీల్దార్, కృష్ణా

అన్ని అక్రమాలే..

బ్లాష్టింగ్‌కు అనుమతులు లేకున్నా నిత్యం భారీ పేలుడు శబ్ధాలతో బ్లాస్టింగ్ నిర్వహిస్తున్నారు. అనుమతి లేని కాంప్రెషరమిషన్లు వాడటం, క్వారీలను నిర్వహించడం, రాయి కోసం పెద్దపెద్ద గోతులు తవ్వడం వంటి అక్రమాలు నిత్యం ఇక్కడ కొనసాగిస్తున్నారు.జిల్లా ఉన్నతాధికారులకు నెలనెలా మామూళ్లు ఇస్తూ అక్రమార్కులు తమ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ఈ గుట్టకు దాదాపు 100కు పైగ క్వారీలు 12 క్రషర్ మిషన్లు ఉన్నాయి. జిల్లాలో ఎక్కడ కూడా ఈ స్థాయిలో లేకపోవచ్చు. బళ్లారిని తలపించే విధంగా కంప్రెషర్ మిషన్లు, టిప్పర్లు, భార వాహనాలు నిత్యం ఇక్కడ పనిచేస్తున్నాయి. కనీసం పంచాయతీలకు పన్నుల రూపంగా కూడా వీటివల్ల ఒక్క రూపాయి కూడా రావడం లేదని ఆయా గ్రామల నాయకులు ఆరోపిస్తున్నారు.

భక్తులకు తీరనున్న తాగునీటి వ్యథ


కురుమూర్తిస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న తాగునీటి సంపు

● కురుమూర్తిస్వామి ఆలయ ప్రాంగణంలో రూ. 36లక్షలతో సంపు నిర్మాణం
● తుది దశలో పనులు

చిన్నచింతకుంట: పేదల తిరుపతిగా విరాజిల్లుతున్న కురుమూర్తిస్వామి ఆలయంలో భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా భక్తులకు తాగునీటి వ్యథ తీర్చేందుకు రూ. 36లక్షలతో చేపట్టిన తాగునీటి సంపు నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయి. మిషన్ భగీరథ పథకంలో భాగంగా 2లక్షల కిలో లీటర్ల సామర్థ్యంగల సంపు నిర్మాణ పనులను మూడు నెలల క్రితం డీఎంఎఫ్‌టీ నిధులతో చేపట్టారు. ప్రస్తుతం సంపు నిర్మాణం తుది దశలో ఉంది. ఈ నిర్మాణం పూర్తయితే మిషన్ భగీరథ నీటిని సంపులో నింపి.. జాతర మైదానంలోని వాటర్ ట్యాంక్‌లకు నీటిని తరలించేందుకు పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. వాటర్ ట్యాంకుల నుంచి జాతర మైదానం, ఆలయ ప్రాంగణంలో అవసరమైన చోట కొళాయిలను ఏర్పాటుచేసి.. తాగునీటిని అందించనున్నారు. ఇందుకు సంబంధించి కలెక్టర్ విజయేందిర, ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి చొరవతో పనులు వేగంగా సాగుతున్నాయి.

● కురుమూర్తిస్వామి బ్రహ్మోత్సవాలకు ప్రతి సంవత్సరం దాదాపు 10లక్షల మంది భక్తులు తరలివస్తారు. అయితే ఆలయం వద్ద 90వేల సామర్థ్యం గల రెండు వాటర్ ట్యాంకులు మాత్రమే ఉండటంతో నీరు సరిపోక భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఆలయ పరిసరాల్లో ఉన్న చేతిపంపులు, సమీప వ్యవసాయ పొలంలో ఉన్న బోరుబావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకునే వారు. మరోవైపు భక్తులకు తాగునీటి వసతి కోసం అధికారులు నానా తంటాలు పడే వారు. సమీపంలోని గ్రామపంచాయతీల నుంచి వాటర్ ట్యాంకర్లతో పాటు ఊకచెట్టు వాగు నుంచి బోరు పంపులను ఏర్పాటు చేసి నీటి వసతి ఏర్పాటు చేసేవారు. అయినప్పటికీ నీటి కొరత తీరేది కాదు. ప్రస్తుతం చేపట్టిన వాటర్ సంపు నిర్మాణంతో ఇబ్బందులు తీరనున్నాయి.

భక్తులకు ఇబ్బందులు లేకుండా..



కురుమూర్తిస్వామి ఆలయం వద్ద తాగునీటి సంపు నిర్మాణంతో భక్తులకు నీటి సమస్య తీరుతుంది. స్వామివారి బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులకు తాగునీటి వసతి కల్పించేందుకు అనేక ప్రయత్నాలు చేసేవాళ్లం. ఇక్కడ సంపు నిర్మాణంతో పాటు మరో 2లక్షల లీటర్ల సామర్థ్యంగల ఓవర్‌హెడ్ ట్యాంక్ నిర్మిస్తే తాగునీటి సమస్య శాశ్వతంగా తీరుతుంది.
– మధనేశ్వర్‌రెడ్డి, ఈఓ.

ఎమ్మెల్యే సహకారంతో పనులు..



స్థానిక ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి సహకారంతో ఆలయం వద్ద పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. అందులో భాగంగా రూ. 36లక్షలతో తాగునీటి సంపు నిర్మాణం చేపట్టాం. పనులు పూర్తయితే భక్తులకు ఎలాంటి నీటి ఇబ్బందులు ఉండవు. నీటి సమస్య తీర్చిన ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు.
– గోవర్ధన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్

యథాతథంగా రెస్క్యూ ఆపరేషన్


టీబీఎం భాగాలను తొలగిస్తున్న సహాయక సిబ్బంది

● ఎస్‌ఎల్‌బీసీలో కొనసాగనున్న అన్వేషణ
● 31వ రోజూ సహాయక చర్యలు ముమ్మరం
● ఏడుగురి ఆచూకీ కనుగొనాలని సీఎం ఆదేశాలు


సొరంగంలో బురద నీటిని బయటకు పంపించేందుకు తీసిన గోతి

అచ్చంపేట: ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో చిక్కుకున్న ఏడుగురి కార్మికుల ఆచూకీ కనుగొనాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించడంతో రెస్క్యూ ఆపరేషన్ యథాతథంగా కొనసాగనుంది. సోమవారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో సీఎం ఎస్‌ఎల్‌బీసీ ప్రమాదం, సహాయక చర్యల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. నేటి సమీక్షలో ప్రభుత్వం సొరంగంలో సహాయక చర్యలు నిలిపివేస్తారన్న అందరి అంచనాలు తారుమారయ్యాయి. రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించలేమని సహాయక బృందాలు చేతులెత్తేసిన నేపథ్యంలో ప్రభుత్వ నిర్ణయంతో మరికొన్ని రోజులపాటు ఆపరేషన్‌లో పాల్గొననున్నారు. 30 మీటర్ల వద్ద అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగిస్తే సహాయక సిబ్బంది ప్రాణాలకు సైతం ముప్పు వాటిల్లనుందని నిపుణులు హెచ్చరించారు. ఈ క్రమంలో ప్రభుత్వం ఎంత రెస్క్యూ అయినా కార్మికులను కాపాడాలని నిర్ణయించుకుంది. సహాయక బృందాల ప్రతినిధులు, ఉన్నతాధికారులు సమీక్షా సమావేశానికి వెళ్లిన సొరంగం కుప్పకూలిన డీ–1, డీ–2 ప్రదేశాల్లో సహాయక సిబ్బంది సోమవారం 31వ రోజు సహాయక చర్యలు చేపట్టారు. సొరంగంలో కూలిన రాళ్లు, టీబీఎం విడి భాగాలను ప్లాస్మా కట్టర్‌తో కట్ చేసి బయటకి తెస్తున్నారు. మట్టి, రాళ్ల దిబ్బలు, బురద పూడిక, ఉబికి వస్తున్న నీటిని వాటర్ జెట్ల ద్వారా బయటికి పంపిస్తున్నారు.

సంక్లిష్ట పరిస్థితుల్లో..

ఎస్‌ఎల్‌బీసీ ఇన్‌లెట్ నుంచి ప్రమాదం జరిగిన 14 కిలోమీటరు వద్ద గాలి, వెలుతురు తక్కువగా ఉండటంతో సహాయక చర్యలు చేపట్టడం సంక్లిష్టంగా మారింది. ఈ క్రమంలో విద్యుత్, వెంటిలేషన్ పనులను పునరుద్ధరిస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో 30 మీటర్లు అత్యంత ప్రమాద జోన్‌గా అధికారులు గుర్తించారు. నేషనల్ జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, ఎన్‌డీఆర్‌ఐ నిపుణుల నివేదిక ప్రకారం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం ఎక్స్‌పర్ట్ కమిటీని కూడా నియమించి వారి సూచనలు, సలహాల మేరకు పనులు కొనసాగించనున్నారు. కేరళ నుంచి వచ్చిన కాడవర్స్ డాగ్స్ గుర్తించిన డీ–1, డీ–2 ప్రదేశాల్లో చేపడుతున్న సహాయక చర్యలకు టీబీఎం భాగాలు అడుగడుగునా అడ్డు వస్తున్నాయి. అదేవిధంగా సొరంగం తవ్వకాలకు మినీ హిటాచీ, కన్వేయర్ బెల్టు, డీవాటరింగ్ పైపులు కూడా అడ్డు పడుతున్నాయి. సింగరేణి, ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్, దక్షిణమధ్య రైల్వే, హైడ్రా, ర్యాట్ హోల్స్ మైనర్స్, ఆర్మీ బృందాలు నిర్విరామంగా శ్రమిస్తున్నా ఫలితం లేకుండా పోతోంది.

నాటుసారా తయారీ కేంద్రాలపై ఎక్సైజ్ దాడులు

● ఒకరి అరెస్ట్


బెల్లం పానకాన్ని ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ సిబ్బంది

లింగాల: మండలంలోలోని చెన్నంపల్లి, పద్మన్నపల్లి, రాయవరం గ్రామాల్లో సోమవారం ఎక్సైజ్ శాఖ నాటుసారా తయారీ కేంద్రాలపై ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఆయా గ్రామాల్లో సోదాలు నిర్వహించగా 6 లీటర్ల నాటుసారా లభ్యమైనట్లు ఎక్సైజ్ ఎస్‌ఐ జనార్ధన్ తెలిపారు. 90 కిలోల నల్లబెల్లం స్వాధీన పర్చుకొని 250 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేసి ఒకరిని అరెస్ట్ చేశామన్నారు. నాగర్‌కర్నూల్ ఎక్సైజ్ అధికారి నవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

జూరాలలో దూకి.. సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణం

● మూడు రోజుల క్రితం బైక్, ల్యాప్‌టాప్ లభ్యం
● తాజాగా ప్రాజెక్టులో లభ్యమైన మృతదేహం


వినయ్ కులకర్ణి (ఫైల్)

అమరచింత: జూరాల బ్యాక్‌వాటర్‌లో దూకి ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి బలవన్మరణానికి పాల్పడ్డాడు. సోమవారం వెలుగుచూసిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా.. కర్ణాటక రాష్ట్రం బీజాపూర్‌కు చెందిన వామనరావు కుమారుడు వినయ్ కులకర్ణి(25) హైదరాబాద్‌లో ఉంటూ ఓ ప్రైవేట్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఇతనికి రెండు నెలల క్రితమే పెద్దలు ఓ యువతితో వివాహం జరిపించారు. అయితే స్వగ్రామం బీజాపూర్‌కు వచ్చిన వినయ్ హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి శుక్రవారం ఇంటి నుంచి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. ఈ క్రమంలోనే తండ్రి వామన్‌రావుకు ఫోన్ చేసి తాను జూరాల ప్రాజెక్టు వద్ద ఉన్నానని, ఆత్మహత్య చేసుకుంటున్నానని చెప్పి ఫోన్ స్విచ్ఛాఫ్ చేశాడు. దీంతో ఆందోళన చెందిన ఆయన జూరాల ప్రాజెక్టు వద్దకు చేరుకుని గాలించగా 17వ నంబర్ షెటర్ వద్ద బైక్, ల్యాప్‌టాప్, సెల్‌ఫోన్ కనిపించాయి. విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం అందించడంతో.. ఎస్‌ఐ సురేష్ జాలర్లతో కలిసి బ్యాక్‌వాటర్‌లో గాలింపు చర్యలు చేపట్టారు. మూడు రోజుల తర్వాత సోమవారం వినయ్ మృతదేహం బ్యాక్‌వాటర్‌లో తేలడంతో జాలర్ల సహాయంతో బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం ఆత్మకూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించడంతో ఆత్మకూర్‌లోని శ్మశాన వాటికలోనే అంత్యక్రియలు నిర్వహించారు. ఈ ఘటనపై వినయ్ తండ్రి వామనరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

పెళ్లయిన రెండు నెలలకే..

వినయ్ కులకర్ణి పెళ్లయిన రెండు నెలలకే ఆత్మహత్య చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోందని బంధువులు పేర్కొన్నారు. చిన్న చిన్న విషయాలకు అతిగా ఆలోచించడం, లోలోపల కుంగిపోయేవాడని పేర్కొన్నారు. అయితే ఆత్మహత్య చేసుకునే పరిస్థితి ఎందుకు దాపురించిందో అర్థం కావడం లేదని తండ్రి వామనరావు రోదిస్తూ చెప్పారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్ష



మహబూబ్‌నగర్ క్రైం: అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జరిమానా విధించగా.. వీరిలో ఒకరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు. ట్రాఫిక్ సీఐ భగవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో 8మంది వాహనదారులు అధిక మోతాదులో మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. వారందరిని సోమవారం కోర్టులో హాజరుపరచగా ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ న్యాయమూర్తి ఆర్.శశిధర్ కేసు పరిశీలించి దీంట్లో నలుగురు వాహనదారులకు రూ.4వేలు, ఇద్దరికి రూ.3వేలు, మరొకరికి రూ.2వేల జరిమానా విధించారు. మరో వాహనదారుడికి మూడు రోజుల జైలు శిక్ష విధించడంతో అతడిని జిల్లా జైలుకు తరలించినట్లు సీఐ తెలిపారు.

ఆకుకూరలు.. వేసవిలో అనువైన పంటలు

పాడి-పంట
అధికారి సలహా: సక్రియనాయక్, జిల్లా వ్యవసాయాధికారి, గద్వాల


ఆకు కూరలు సాగు


ఆకు కూరలు

అలంపూర్ : వేసవిలో ఆకు కూరల సాగు రైతులకు కొంత వరకు లాభసాటిగా ఉంటుంది. ప్రజల ఆరోగ్య రక్షణ కల్పించడంతోపాటు రైతులకు లాభసాటిగా ఉంటుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియనాయక్ రైతులకు సూచిస్తున్నారు. వాటి వివరాలను ఇలా వివరించారు.

అనుకూలమైన ఆకు కూరలు

వేసవిలో ముఖ్యంగా గొంగూర, తోట కూర, పాల కూర, మెంతికూర, కొత్తిమీర, పుదీనా మొదలైన ఆకు కూరలు సాగు రైతులకు మేలు చేస్తాయి. వేసవిలో సాగుకు అనుకులమైన విత్తనాలనే వాడాలి.

తోట కూర :

తోట కూరలో ఆర్ఎన్ఏ–1 రకం ముఖ్యమైనది. ఆకులు, కాండం లేత ఆకు పచ్చరంగులో ఉంటాయి. విటమిన్ ఏ, సీలు అధికంగా ఉంటాయి. కాండం కూడా పీచు లేకుండా మృదువుగా రుచికరంగా ఉంటాయి. నెల రోజుల్లో ఎకరాకు 5–6 టన్నుల దిగుబడి వస్తోంది. మొదటి కోత ఎత్తిన 15–20 రోజుల్లో వస్తోంది. మొదటి కోత తర్వాత పక్క కొమ్మలు బాగా వస్తాయి. నీటి ఎద్దడిని తెల్ల మచ్చ తెగుళును తట్టుకుంటుంది. ఎకరానికి 800 గ్రాముల విత్తనం అవసరం.

పాల కూర :

పాలకూరలో ఆల్ గ్రీన్ రకం లేత ఆకులు కలిగి 15 నుంచి 20 రోజులకు కోతకు వస్తోంది. 6 నుంచి 7 కోతల్లో ఎకరానికి 5 నుంచి 6 టన్నుల దిగుబడి వస్తోంది. ఎకరానికి 10 నుంచి 12 కిలోల విత్తనాలు అవసరం. విత్తనాలను 20Ğ10సెంటీమీటర్ల ఎడంగా, 3–4 సెంటీమీటర్ల లోతు మించకుండా విత్తుకోవాలి. లోతు ఎక్కువైతే మొక్క సరిగ్గా రాదు. విత్తిన 8–10 రోజులకు గింజలు మొలకెత్తుతాయి.

గొంగూర :

ఎఎస్‌జీఆర్‌యు–1 రకం ప్రధానమైనది. ఎకరానికి 4–5 టన్నుల దిగుబడి వస్తోంది. ఎకరాకు 6 కిలోల విత్తనం అవసరం. ముందుగా 60 సెంటీమీటర్ల ఎడంగా బోదలు చేసుకొని బోదలకు రెండు వైపుల విత్తనాన్ని 30 సెంటీమీటర్ల దూరంలో వరుసల్లో వేయాలి. మొలకెత్తిన 20 రోజులకు వత్తుగా ఉన్న మొక్కలను పీకి కట్టలు కట్టి విక్రయించాలి.

మెంతి కూర :

పూసా ఎర్లీ బంచీంగ్ రకం. ఇది త్వరగా కోతకు వచ్చే రకం. ఎకరాకు 8 నుంచి 10 కిలోల విత్తనాన్ని వరుసల మధ్య 25 సెంటీమీటర్లు, మొక్కల మధ్య 10 సెంటీమీటర్ల ఎడం ఉండే విధంగా విత్తుకోవాలి.

కొత్తమీర

సీఎస్–6 రకం పంట కాలం 80 నుంచి 85 రోజులు నీటి ఎద్దడిని తట్టుకుంటుంది. సాధన(సీఎస్–4) రకం పేను బంకను తట్టుకుంటుంది. ఎకరానికి 4 నుంచి 5 కిలోల విత్తనాన్ని 15 సెంటీమీటర్ల ఎడంలో విత్తుకోవాలి. విత్తిన 8–12 రోజుల్లో గింజలు మొలకెత్తుతాయి.

ఎండ నుంచి రక్షణ

ఆకు కూరలు అధిక ఎండలను తట్టుకోలేవు. కాబట్టి వేసవిలో సాగుకు నీడ ఉన్న ప్రాంతాన్ని ఎంచుకోవాలి. పొలంలో నీడనిచ్చేలా మొక్కజొన్న, ఆముదం పంటలను ఉత్తర, దక్షిణ దిశల్లో నాటుకోవాలి. వేసవిలో మొక్క పెరుగుదల తక్కువగా ఉంటుంది. మొక్కల సంఖ్య ఎక్కువగా ఉండే విధంగా చూసుకోవాలి. వేసవిలో నీటి అవసరం ఎక్కువ కాబట్టి స్ప్రింక్లర్ల పద్ధతిలో ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసుకోవచ్చు.

పురుడు పోసుకున్న నీరుకట్ట పాము


కళాశాల ఎడ్యుకేషన్ సెంటర్‌లో భద్రపర్చిన నీరుకట్ట గుడ్లు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల బయోడైవర్సిటీ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో భద్రపర్చిన నీరుకట్టపాము సోమవారం పురుడు పోసుకుంది. మండలంలోని నసురుల్లాబాద్‌లో నాలుగురోజుల క్రితం ఓఇంట్లోకి పామురాగా సర్పరక్షకుడు డా. సదాశివయ్యకు ఫోన్‌ద్వారా సమాచారమిచ్చారు. దీంతో ఆయన శిష్యులను పామును పట్టుకురమ్మని పంపించగా వారు వెళ్లి నీరుకట్ట పాముగా గుర్తించి పట్టుకున్నారు. పాముతో పాటు అది పెట్టిన 21గుడ్లను సైతం కళాశాల బయో డైవర్సిటీ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ సెంటర్‌కు తీసుకొచ్చారు. గుడ్లను పొదిగేందుకు కళాశాలలో సరైన సౌకర్యాలు లేకపోవటంతో హైదరాబాద్ ఫ్రెండ్స్ ఆఫ్ స్నేక్ సొసైటీకి పంపించేందుకు భద్రపర్చారు. భద్రపర్చిన గుడ్లలో సోమవారం 10పిల్లలు బయటకు వచ్చాయి. పిల్లలను అటవీ ప్రాంతంలో వదిలివేయనున్నట్లు తెలిపారు. ఈకాలంలో నీరుకట్ట పాము గుడ్లు పిల్లలను లేపే అవకాశం అధికంగా ఉంటుందని, ఎక్కువగా తడితో కూడిన ప్రదేశంలో భూమిలోని రంధ్రాల్లో గుడ్లను పెట్టి ఉంటాయని సర్పరక్షకుడు డా.సదాశివయ్య తెలిపారు. నీరుకట్ట గుడ్లనుంచి పాము పిల్లలు బయటకు రావటంపై కళాశాల ప్రిన్సిపాల్ డా. సుకన్య ఆనందం వ్యక్తం చేశారు.